# పక్షులెగిరిపోయిన తోట

మా మేనత్త చనిపోయిందంటే ఊరెళ్లాను. ఇంత అకస్మాత్తుగా ఆమె మరణించిందంటే నమ్మబుద్ధి కాలేదు. మా మేనమామ ఇంటి ఎదురుగానే మా ఇల్లు. నేరుగా మా ఇంట్లోకి వెళ్లాను. ఊళ్లో మా అమ్మ ఒక్కతే వుంటుంది. మేం వస్తున్నామని తెలిసిలోపల పెట్టేసిన వంట సామాగ్రినంతా బయటకు తీయడంలో నిమగ్నమై వుంది మా అమ్మ. ఇంట్లోకి అడుగు పెడుతూనే "ఎలా చనిపోయింది?" అని అడిగాను మా అమ్మను. "ఏమో బిడ్డా! బాలవ్వ బిడ్డ వచ్చి లక్ష్మమ్మ పడిపోయిందని చెప్తే గబగబా పోయిన. నేను వెళ్లేసరికి ఏముంది? లక్ష్మి రక్తం కక్కుఉని పడిపోయింది. నేల మీద రక్తం మడుగు. నాకు కళ్లు గిర్రున తిరిగినయ్.." అని చెప్పింది. మాఅమ్మ కన్నా దాదాపు పది, పదిహేనేళ్లు చిన్నది మా మేనత్త. ఆరోగ్యంగా కూడా కనిపించేది. ఇంత హఠాత్తుగా ఆమెను మృత్యువు కబళించిందంటే నమ్మలేకపోతున్నాను.

లోన గూడు కట్టుకున్న విషాదమే ఆమెను మింగేసిందా అని సందేహం కలిగింది. మా అమ్మ కష్టాలతో పోల్చుకుంటే ఆమెవి కష్టాలే కావు. కానీ, ఆమెకున్నటువంటి కష్టాలు మా అమ్మకు లేవు. మా మేనమామ ఇంట్లోకి వెళ్ళాను. బంధువులందరూ వచ్చారు. మా మేనత్త కూతుళ్లు తల్లి శవం పక్కనే కూర్చుని కంటికి మింటికి ఏకధారగా ఏడుస్తున్నారు. మా మేనత్త కొడుకు రాంరెడ్డి ముఖం చూశా. చాలా పీక్కుపోయినట్లుంది. ఒక మూలన ఆరాంకుర్చీలో మౌనంగా కూర్చున్నాడు మా మేనమామ. అతనిలో ఏ భావమూ వ్యక్తం కావడం లేదు. ఆయన ప్రభుత్వ పాఠశాలలో టీచర్. ఈ రకంగా ఊళ్లో ఆయన హోదా పెరిగినట్లే. కానీ, ఎప్పుడూ మా మేనత్త మిగతా టీచర్ల భార్యలతో కలిసేది కాదు. ఇలా కలవకపోవడానికి కారణాలు నాకు పెద్దయ్యాక అర్థమయ్యాయి. మిగతా టీచర్లు చాలా మంది ఊరిలోని మోటాటి రెడ్లు. కొంత మంది ఇతర గ్రామాలవారు.

ఆమె ముఖం చూశాను. ప్రశాంతంగా నిద్రపోతున్నట్లు అనిపించింది. ఆమె ఎప్పుడూ మా అమ్మమ్మ మీద, మా అమ్మ మీద ధుమధుమలాడుతూ వుండేది. తన భర్తను తనకు దూరం చేస్తున్నారనేది ఆమెకు మా అమ్మ, అమ్మమ్మల మీద ఉన్న కంటెంప్ట్ అనుకుంటా. మా అమ్మమ్మ మా మేనత్తతో తగువు పెట్టుకుని మా ఇంట్లోకి వచ్చి మా అమ్మతో గుసగుసలాడేది. కోడలు మీద ఆమె ఫిర్యాదులు చేస్తుందనేది నాకు తెలిసిపోతూనే వుండేది. ఇలా ఫిర్యాదులు చేస్తూ మధ్య మధ్యలో "కులం తక్కువ బుద్ధులు ఎక్కడికి పోతాయి" అనేది మా అమ్మమ్మ. మేనత్త మా కన్నా కులం తక్కువ ఎట్లాగో నాకు చిన్నప్పుడు అర్థం కాలేదు.

అక్కడ నిలబడాలనిపించలేదు. బయటకు వచ్చి ఎదురుగా వున్న మా ఇంట్లోకి వెళ్లాను. మా అమ్మ టీ చేసింది. మా ఆవిడ, పిల్లలు, మా అన్న, మా వదిన అందరూ మా మేనత్త వాళ్లింట్లోనే వున్నారు. టీ తాగుతూ - "అమ్మమ్మ ఎప్పుడూ అత్తమ్మను తిట్టేది ఎందుకు?" అని అడిగా మా అమ్మను. "దానిదో గొడవ. పెళ్లి కావడంతో తనకు కొడుకు దూరమైపోతాడేమోనని దాని భయం. అది చెప్పే మాటలకు మామ కూడా మీ అత్తమ్మంటే చిర్రుబుర్రులాడేవాడు" అని చెప్పింది.

టీ తాగేసి పెరట్లోకి చూశాను. మా పెరటి గోడ సగం కూలిపోయింది. మా పెరడు అవతల పచ్చటి పొలాలు వుండేవి. మొక్కజొన్న, పెసర, రకరకాల కూరగాయల మొక్కలతో అది కనువిందు చేసేది. దానికి వెంకటరెడ్డి కాపలా కాసేవాడు. చేల మీద పిట్టలను, ఇతర పక్షులను ఎగుర గొట్టినట్లు గానే నోటి అదురుతో నన్ను, నాలాంటి పిల్లకాయలను భయపెట్టేవాడు. ఆ చేను వైపు చూడాలంటే కూడా భయమేసేది. మా పెరట్లో కూడా వర్షాకాలంలో మొక్కజొన్న చేను వేసే వాళ్లం. అవతలి చేలో నుంచి తరిమేయబడ్డ పక్షులు మా మొక్కజొన్న చేను మీద వాలేవి.

ఒక్కసారిగా విషాదం గుండెలో నిండిపోయింది. వెంకటరెడ్డి చనిపోయాడు. ఆ తోటకు నీరందించే బావి ఎండిపోయింది. వర్షాలు లేక, దున్ని, పంట వేసేవారు లేక మా పెరడు పాడుబడిపోయింది. పక్షులు లేవు. వాటిని ఎగరగొట్టడానికి మనుషులూ లేరు. అంతా నా ప్రేమ లాగే అయిపోయిందనిపించింది.

సౌందర్యకు నేనెప్పుడయినా గుర్తొస్తానా అని ప్రశ్నించుకున్నాను. ఆమె కనిపిస్తే బాగుండు అనుకుంటాను. ఇప్పుడూ అలాగే అనుకున్నాను. వెంటనే ఊళ్లోకి బయలుదేరాను. వాళ్లింటి ముందు నుంచి వెళ్తూ ఎప్పటిలాగే వాళ్లింట్లోకి తొంగి చూశాను. పెద్ద బంగళా అది. ఇంటి ముందు విశాలమైన వాకిలి. వాకిలిని కూడా మూస్తూ పెద్ద ద్వారం. ద్వారానికి బలమైన తలుపులు. ఈ తలుపులు మూసిన గుర్తు లేదు నాకు. ఎప్పుడూ తెరిచే వుంటాయి. వాకిలి బోసిపోయినట్లుంది. నేను లోనికి తొంగి చూసినప్పుడు రివ్వున బయటకు పరుగెత్తుకొచ్చేది సౌందర్య. వాళ్ల నాన్న ఇంట్లో వున్నప్పుడు మాత్రం ఏదో పని చేస్తున్నట్లు నటిస్తూ అక్కడే నిలబడేది. మిగతా వాళ్లు ఆమె పరుగెత్తుక రావడం నేను ఆమెతో గంటలు గంటలు మాట్లాడడం పెద్దగా పట్టించుకునేవారు కారు.

అలాగే నడవసాగాను. నా ప్రమేయం లేకుండానే వేంకటేశ్వరస్వామి గుడి దాకా వెళ్లాను. గుడిని చూశాను. పెద్ద చార్మింగ్‌గా అనిపించలేదు. నా చిన్నప్పుడే అన్నసత్రాలు శిథిలావస్థలో వున్నాయి. ఇప్పుడు అవి మరింతగా శిథిలమయ్యాయి. దేవుడ్ని ఊరేగించే రథం చక్రం పూడిపోయి వుంది. ఇప్పుడు 'శావ' తీయడం లేదని మా అమ్మ చెప్పినట్లు గుర్తు. ఇదే గుళ్లో సౌందర్య, నేను కూర్చొని గంటల తరబడి ముచ్చట్లాడే వాళ్లం. పూజారి మమ్మల్ని చూసి

పలకరింపుగా నవ్వేవాడు. అంతే, ఒక్క మాట కూడా అనేవాడు కాదు. అప్పుడప్పుడు మేం కొబ్బరికాయ తీసికెళ్తే దాన్ని కొట్టి సగం మాకిచ్చి ఇద్దర్నీ శఠగోపంతో దీవించేవాడు. మేమిద్దరం ఇలాగే కలిసి వుంటామని అతని దీవెనలు నాకో నమ్మకాన్ని ఇచ్చేవి. ప్రతి సంక్రాంతికి అక్కడ జాతర జరుగుతుంది. ఆ జాతరలో నేను సౌందర్యను చూడడం, ఆమె నన్ను చూడడం తప్ప మరోటి వుండేది కాదు మాకు. ఎడ్ల బండ్ల గుడి చుట్టూ తిరుగుతూ వుంటే నా మనసు సౌందర్య చుట్టూ తిరుగుతుండేది. నేను హైదరాబాద్‌లో చదువుకుంటున్నప్పుడు తప్పకుండా సంక్రాంతికి ఊరు వెళ్లేవాడ్ని. ఆమె పెళ్లయిన తర్వాత కూడా సంక్రాంతికి తప్పకుండా వెళ్లేవాడ్ని. ఆమె పెళ్లయిన తర్వాత పండుగకు ఆమెను జాతరలో చూడడానికి తప్ప మరో రకంగా చూడడానికి వీలయ్యేది కాదు. ఓసారి నావైపు చూసి తన దారిన తాను పోయేది సౌందర్య. అలా చూసినప్పుడు నా మీద ఆమెకింకా ప్రేమ వుందా అనే ప్రశ్నించుకునేవాడ్ని. ఆమె చూసినప్పుడు ఆమెకు ఈ ప్రశ్న వేయాలని వుండేది. కానీ, అందుకు నేనేం ప్రయత్నం చేయలేదు. ప్రయత్నం చేయకపోవడమనేది నా భయమో, అసమర్ధతో కారణాలు కావని నాకు స్పష్టంగా తెలుసు. మేం విడిపోయిన పద్ధతే అందుకు కారణం.

సౌందర్యపై తరగని ప్రేమ, నన్ను ఆమెకు దూరం చేసిన దొరతనం మీద ద్వేషం. ఇవి రెండే నా అభిప్రాయాలను, ఇష్టాయిష్టాలను శాసిస్తున్నాయని నాకు అప్పుడప్పుడు అనిపిస్తుంటుంది. మళ్లీ ఇంటికెళ్లాను. మేనత్త శవయాత్ర బయలు దేరింది. ఊరు మధ్య నుంచి గుట్ట వైపు బయలు దేరింది. ఊరవతల ఉన్న ఆ చిన్న గుట్ట మా మిత్రులకు ఒక విడిది. సాయంత్రాలు, సెలవు రోజుల్లో ఆ గుట్టపైకి వెళ్ళేవాళ్లం. హైదరాబాద్ నుంచి ఊరికి వచ్చినప్పుడు కూడా సాయంత్రాలు గుట్ట పైకి ఎక్కడం నాకు అలవాటుగా మారింది. ఆ గుట్టపై నుంచే గాలిపటాలు ఎగిరేసేవాళ్లం. అప్పుడు పచ్చని కంది చేను మధ్య నుంచి వెళ్తుంటే పక్షులు లేస్తూ చప్పుడు చేసేవి. ఇప్పుడు చేనూ లేదు, పక్షులూ లేవు. గుట్ట పక్కనే స్మశానం.

రంగారెడ్డి అప్పుడు నన్ను గుట్ట పైకే తీసుకొచ్చాడు. సీరియస్ విషయాలు మాట్లాడడానికి కూడా ఈ గుట్టపైకే రావడం మా ముందుతరం వారికి, మా తరంవారికి ఆనవాయితీ. "నువ్వు సౌందర్యను పెళ్లి చేసుకుంటావా?" అని అడిగాడు. రంగారెడ్డి సౌందర్య కుటుంబానికి దగ్గరివాడు. రంగారెడ్డి తండ్రి తెలంగాణా సాయుధ పోరాటంలో పాల్గొన్నాడు. కమ్యూనిస్టు కుటుంబం నుంచి వచ్చినవాడు కావడం వల్ల అతను మాతో కూడా సన్నిహితంగా వుండేవాడేమో అని ఇప్పుడనిపిస్తుంది నాకు.

"అవును" అన్నాను.

"మీ నాయన సౌందర్య వాళ్లింటికి వెళ్తే ఎలా వ్యవహరిస్తాడు?" అని అడిగాడు. నేను సమాధానం చెప్పలేదు. నా మౌనాన్ని అతను అడ్వాంటేజ్‌గా తీసుకున్నాడు. "సౌందర్య తండ్రి ఆరాం కుర్చీలో దర్జాగా కూర్చుంటే మీ నాయన చేతులు కట్టుకుని వాకిట్లో నిలబడతాడు. నీకు



సౌందర్యను ఇచ్చి సౌందర్య తండ్రి పెళ్లి చేస్తాడని ఎలా అనుకుంటున్నావు?" అన్నాడు. "అతని అంగీకారంతో పనేమిటి?" అని అడిగాను. నాలో ఉక్రోషం కట్టలు తెంచుకుని పొంగి పొర్లేలా వుంది. తమాయించుకున్నాను. "సౌందర్య ధైర్యం చేసి నీతో వచ్చేస్తుందనుకుంటున్నావా?" అని అడిగాడు. నేను మాట్లాడలేదు. నాలో సందేహం మొదలైంది. "నువ్వే అడుగు. ఏమంటుందో?" అని లేచి వెళ్లిపోయాను.

మా మేనత్త శవం కాష్టం మీద భగభగ మండుతోంది. మాడు చిట్లింది. అందరూ వెనుదిరిగారు. ఆలోచనలతో నేనూ వెనుదిరిగాను. మా మేనత్తను మా అమ్మమ్మ కులం తక్కువగని తిట్టడానికి, రంగారెడ్డి నాకు చెప్పిన సత్యానికి ఒకే లంకె వున్నట్లు నాకనిపించింది. సౌందర్య కుటుంబం రెడ్ల కుటుంబం, మాదీ రెడ్ల కుటుంబమే. మా మేనత్త కూడా రెడ్ల కుటుంబం నుంచి వచ్చిందే. మాలమాదిగలను మా ఇళ్లలోకి రానీయకపోవడం అనుభవంలోనిదే. కానీ, కలిసి వుంటూ కూడా ఇంత తేడా పాటించాలా? సౌందర్యవాళ్లు మోటాటి రెడ్లు, మేం పాకనాటి, మా మేనత్తవాళ్లు గుడాటి రెడ్లు. రెడ్లలో ఎనిమిది రకాల రెడ్లు ఉన్నారు. వీరి మధ్య కూడా అంటరానితనమేదో వున్నట్లు నాకనిపించింది.

చాలా రోజుల తర్వాత ఊరికి వచ్చిన నన్ను ఆ జ్ఞాపకాలు వదలడం లేదు. వాటిని నెమరేసుకుంటూ ఒంటరిగా గడపడం నాకెందుకో ఇప్పుడు ఒక కలగా వుంది. ఆ కలను తుంచేయడం నాకిష్టం లేదు. ఇంటికి వచ్చి పెరట్లోకి వెళ్లాను. వెంకటరెడ్డి కాపలా కాసిన తోట బోసిగా కనిపించింది. కర్ర పట్టుకుని నడిచే వెంకటరెడ్డి మోటాటి కులమే మమ్మల్ని అంతగా ఆ రోజుల్లో భయపెట్టిందా? ఈ కులం వల్లనే నాకు, సౌందర్యకు వున్న ప్రేమ సంబంధం ఏమీ జరగనట్లే మాసిపోయిందా? ఇదెంత హింస? రంగారెడ్డి ఆ మాటనగానే నేను సౌందర్య వాళ్లింటికి వెళ్లాను. మా నాయన చేతులు కట్టుకుని నిలబడే ఇంట్లో నేను దర్జాగా కుర్చీలో కూర్చోగలను. నాకు ఆ స్వతంత్రం ఎలా వచ్చింది? నా చదువు వల్ల కావచ్చు. ఇంట్లోకి రానిచ్చే ఆ పెద్ద మనిషి సంబంధం కలుపుకోవడానికి కులం అడ్డం వచ్చింది. "నాతో వచ్చేస్తావా?" అని నేరుగా అడిగాను సౌందర్యను. ఆ సమయంలో ఇంట్లో ఆమె, నేను తప్ప ఎవరూ లేరు. ఎవరూ లేకుండా చూసుకునే వెళ్లానేమో! కానీ గుర్తు చేసుకుంటే రక్తం ఉడికిపోతుంటే ఇంట్లోకి ఒక వీరుడిలా ప్రవేశించినట్లనిపిస్తుంది. "రాను" అంది. "ఏం?" అన్నాను. ఆమె మాట్లాడలేదు. "నా మీద నీకు ప్రేమ లేదా?" అని అడిగాను. "లేదు" అంది. నాకు బాధ కలిగిందో, కోపం వచ్చిందో ఇప్పుడు చెప్పడం కష్టం. వెంటనే బయటకు వెళ్లి సిగరెట్ కొనుక్కొచ్చి వాళ్లింట్లోనే తాగాను. గట్టిగా సిగరెట్ పొగంతా పీల్చిన తర్వాత నన్నేదో వైరాగ్యం

ఆవరించినట్లనిపించింది. బహుశా, నాతో సౌందర్య రానన్నందుకు నాకంత బాధ, కోపం కలగలేదనుకుంటా. నీ మీద ప్రేమ లేదనే మాట నన్ను ఘోరంగా దెబ్బతీసినట్లనిపించింది. ఆమెకు నా మీద ప్రేమ లేదనే మాట అబద్ధమని నేను ఇప్పటికీ నమ్ముతుంటాను. చాలాసార్లు ఆమె నా మీద తన ప్రేమను వర్షించింది. ఆ ప్రేమ వర్షంలో నిండా మునిగిపోయానని అనడానికి నా జ్ఞాపకాల నుంచి ఆమె నవ్వు చెరిగిపోకపోవడమే.

ఆ తర్వాత ఇంటికి వచ్చిన నన్ను అమ్మ అడగలేక అడిగింది ఆ అమ్మాయిని మర్చిపొమ్మని. నేను మాట్లాడలేదు. "నీ మంకు నీదేనా?" అని అడిగింది. అంతా అయిపోయిన తర్వాత మా అమ్మ నన్నీ కోరిక కోరడం నాకు నవ్వు తెప్పించింది. "ఎందుకురా నవ్వుతావు?" అని అడిగింది. "ఏం లేదు" అని చెప్పేశా, దొరల బంకుల్లో మాట్లాడుకుంటుంటే బంకులూడ్చే మల్లి విన్నదట. ఆ విన్న మాటలనే మల్లి మా అమ్మకు చెప్పిందట. మా అమ్మ నాకు చెప్పిన వివరాల ప్రకారం - సౌందర్య మనసు మార్చడానికి కూడా ఆమె తలిదండ్రులు రంగారెడ్డినే ప్రయోగించారట. "నువ్వు కనుక వాడ్ని కాదనకపోతే వాడి ప్రాణాలుండవు. మీ నాయన వాడ్ని చంపేస్తాడు" అని రంగారెడ్డి సౌందర్యకు చెప్పాడు. ఇది తెలిసినప్పుడు నాకనిపించింది - పంజరంలోని చిలుక మీద కత్తి వేటు పడినట్లు సౌందర్య భయంతో గజగజలాడే వుంటుందని.

నా ప్రేమకథ విషాదాంతం కావడంతో నేను ఊరికి రావడం తగ్గించాను. ఇప్పుడయితే వెంకటరెడ్డి తోటా, మా పెరడే కాదు, ఊరు ఊరంతా పక్షులెగిరిపోయిన తోటలా వుంది.

*(మార్చి 2001లో ప్రచురించిన 'విజయ విహారం' సంచిక నుంచి....)*